సాక్షి
శ్రీకాకుళం

గురువారం ׀ 12 ׀ జూన్ ׀ 2025



ఇంటి దొంగల పనే..

డాక్టర్ రెడ్డీస్ పరిశ్రమలో ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఎనిమిది మందిని అరెస్టు చేశారు. - 8లో



కక్ష ఎందుకో?

పక్షవాత బాధిత ఉద్యోగులపై కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. వారి గోడు వినకుండా దూరప్రాంతాలకు బదిలీ చేస్తోంది. - 8లో

ముగిసిన పీజీసెట్ పరీక్షలు

ఎచ్చెర్ల: రాష్ట్రంలోని యూనివర్శిటీలు, అనుబంధ కళాశాలల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఏపీ పీజీ సెట్ -2025 పరీక్షలు బుధవారంతో ముగిశాయి. చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన ఈ పరీక్షలకు మూడు రోజుల్లో మొత్తం 1284 మందికి గాను 1126 మంది విద్యార్థులు హాజరయ్యారు.

న్యూస్‌రీల్

యువతకు బాసటగా.. 13న వైఎస్సార్ సీపీ నిరసన



నరసన్నపేట: విద్యార్థులు, నిరుద్యోగులు, యువతను మోసగించిన కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ నెల 13న కలెక్టర్ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నామని పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగంతో పాటు యువత, నిరుద్యోగులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యార్థులను గందరగోళంలోనికి నెట్టేశారని దుయ్యబట్టారు. నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ హామీలను గాలికొదిలేశారని మండిపడ్డారు. ఏడాది కాలంగా నిరుద్యోగులను, యువతను, విద్యార్థులను తీవ్రంగా మోసం చేశారని ధ్వజమెత్తారు. శుక్రవారం జరిగే నిరసన కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'కూర్మ'లో పర్ణశాల దగ్ధం



పర్ణశాలలో మంటలు

హిరమండలం: వైదిక గ్రామం కూర్మలో మంగళవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో పర్ణశాల దగ్ధమైంది. సుమారు పది గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఆశ్రమవాసులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో కొత్తూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. అప్పటికే పర్ణశాలతో పాటు లోపలున్న వస్తువులు ఖాళీ బూడిదయ్యాయి. ఈ ఘటనలో దాదాపు రూ.40 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. ప్రమాద ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు స్థానిక స్వామీజీ నరోత్తమ ప్రభుదాస్ బుధవారం తెలిపారు. ఎవరో కావాలనే ఈ ఘటనకు పాల్పడి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. కొండల ప్రాంతంలో ఉన్న వైదిక గ్రామానికి రక్షణ కల్పించి భద్రతా చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలోని 16 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ పథక సంచాలకులు బి.శాంతిశ్రీ తెలిపారు. ఈ మేరకు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. 21 అంగన్‌వాడీ కార్యకర్తలు, 53 అంగన్‌వాడీ సహాయకులు, ఒక మినీ అంగన్‌వాడీ పోస్టులు కలిపి 75 పోస్టులను భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన రూల్ ఆఫ్ రిజర్వేషన్, కమ్యూనల్ రోస్టర్ రిజిస్టర్ అనుసరించి, కేటగిరీల వారీగా పోస్టులను భర్తీ చేయనున్నట్లు వివరించారు. అర్హులైన మహిళా అభ్యర్థులు ఈ నెల 12 నుంచి 20వ తేదీ సాయంత్రం 5గంటలలోగా సంబంధిత శిశు అభివృద్ధి పథక అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఇంటర్వ్యూ తేదీ, స్థలం తర్వాత తెలియజేస్తామని పేర్కొన్నారు. పోస్టుల భర్తీ నిలుపుదలకు, రద్దుకు సంబంధించి నియామకపు కమిటీ చైర్మన్‌కు పూర్తి అధికారం ఉందని స్పష్టం చేశారు.

ఘనంగా చక్రతీర్థ స్నానాలు



పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలకు చక్రతీర్థ స్నానాలు నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో మధుకేశ్వరుని చక్రతీర్థ స్నానాలు బుధవారం ఘనంగా జరిగాయి. జేష్టమాసం బుధవారం పార్వతీ పరమేశ్వరులను చక్కగా అలంకరించి పల్లకిలో ఆసీనులుగా చేశారు. అనంతరం వంశధార నదిలో స్వామివారి సహిత వారాహి అమ్మవారికి చక్రతీర్థ స్నానాలు నిర్వహించారు. అక్కడి నుంచి దేవాలయానికి ఉత్సవమూర్తులను తీసుకొచ్చి ప్రత్యేక పూజలు, ఏకవార అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామివారి పాంచరాత్రి కల్యాణ ఉత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో అర్చకులు అచ్యుతరావు, రవి శంకర్ శేషాచలం, అప్పారావు, ధనాలస్వామి, శివాజీ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



బాబు సృష్టించింది ▸ మోసాల సంపదే.!

● అధికారంలోకి రావడానికి అడ్డమైన హామీలు ● పదవిలోకి వచ్చాక పిల్లిమొగ్గలు ● డైవర్షన్ పాలిటిక్స్, సంపద సృష్టి డ్రామాలతోనే సరి

అధికారమే పరమావధిగా సిగ్గువదిలి పొత్తులు.. సంపద సృష్టి అంటూ డాంబికాలు, అసత్య ప్రచారాలు.. మాయమాటలతో.. 143 బూటకపు హామీలు వెరసి.. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదైంది. ఇప్పుడా హామీలు అమలు చేయకుండా.. ఖజానా ఖాళీ అయ్యిందంటూ కొత్త డ్రామాలాడుతున్నారు. పథకాలు ఇవ్వలేదని ఎవరైనా అడిగితే సంపద ఎలా సృష్టించాలో చెవిలో చెప్పాలంటూ ఎదురుదాడికి దిగడం తప్ప ఏడాది కాలంలో చేసిందేమీ లేదు. మరోవైపు, దోపిడీ, దౌర్జన్యాలు ఎక్కువైపోయాయి. ఇసుక, గ్రానైట్, గ్రావెల్, మట్టి తదితర వనరులను దోచుకోవడం, దాడులను ప్రోత్సహించడం తప్ప ఏడాది పాలనలో ప్రత్యేకంగా కన్పించిందేమి లేదు. –సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం

గోబెల్స్‌కు మించి..



ఎన్నికల సమయంలో ఏకంగా 143 హామీలిచ్చి ఇప్పుడు పిల్లి మొగ్గలు వేస్తున్నారు. వైఎస్ జగన్ హయాంలో రాష్ట్రం శ్రీలంక అయిపోతుందని.. రూ.14లక్షల కోట్లు అప్పులంటూ గోబెల్స్‌కు మించి తప్పుడు ప్రచారం చేశారు. తాము అధికారంలోకి వస్తే అప్పుల వైపు చూడకుండా సంపద సృష్టించి సంక్షేమం, అభివృద్ధి అందిస్తామని చెప్పారు. ఇప్పుడేమో వారం వారం అప్పులకు వెళ్లి రూ.వేల కోట్లు తెస్తున్నా పథకాలు అమలు చేయడం లేదు.

రైతుకు సున్నం..



అదును దాటిపోతున్నా అన్నదాతలకు సాయం చేయడం లేదు. రైతన్నలకు రూ.20వేలు సాయం గాలికొదిలేశారు. జిల్లాలో 3,14,212 మందికి అన్నదాత సుఖీభవకు సంబంధించి రూ.628.42కోట్లు మేర ఎగ్గొట్టారు.

నిరుద్యోగులకు పంగనామం..



ఏటా నాలుగు లక్షల ఉద్యోగాలు ఇస్తామని, రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. ఏడాది గడిచిపోయింది. 7,28,210 మందికి రూ.218.46కోట్లు మేర ఇవ్వకుండా మొండి చేయిచూపారు. మరోవైపు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మధ్యాహ్నం భోజన పథకం నిర్వాహకులు, రేషన్ డిపో డీలర్లు, పాఠశాలల్లో పనిచేసే వర్కర్స్, ఆరోగ్య శాఖలో పనిచేసే తాత్కాలిక ఉద్యోగులు.. ఇలా అనేకమందిని తొలగించారు. తాజాగా సంచార పశు ఆరోగ్య సేవా సంస్థ సిబ్బందిని కూడా తొలగిస్తున్నారు.

నేతలకు మద్యం పండగ..



జిల్లాలో లిక్కర్ షాపులన్నీ దాదాపు అధికార పార్టీ నేతల గుప్పెట్లో ఉన్నాయి. సిండికేట్‌గా ఏర్పడి మందుబాబులను పీల్చేస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో లైసెన్సు దుకాణాల కౌంటర్లలో ఎంఆర్‌పీకి మించి రూ.10, రూ.20 అదనంగా విక్రయిస్తుండగా, మిగతా చోట్ల బెల్ట్‌షాపులు పెట్టుకుని అడ్డంగా సంపాదిస్తున్నారు. జిల్లాలో 10వేలకు పైగా బెల్ట్‌షాపులు ఉన్నట్లు సమాచారం. అక్కడ క్వార్టర్ బాటిల్‌పై రూ.30 నుంచి రూ.70 వరకు అదనంగా వేసి విక్రయిస్తున్నారు.

ఆడబిడ్డ నిధి ఎక్కడ?



మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు 19 నుంచి 60 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పారు. ఈ పథకం కింద 7,59,692 మంది అర్హులై ఉన్నారు. వీరంతా తమకు రూ.1500 ఎప్పుడొస్తుందా? అని ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే సంవత్సరంలో రూ.113.95 కోట్ల మేర కోల్పోయారు.

అయోమయంలో తల్లికి వందనం..



ఎంతమంది పిల్లల్ని చదివిస్తే అంతమందికి తల్లికి వందనం కింద రూ.15వేలు చొప్పున ఇస్తానని ఊదరగొట్టారు. సంవత్సరం ముగియడంతో దాదాపు రూ.484.52కోట్లు మేర తల్లిదండ్రులు కోల్పోయారు. తాజాగా నేటి నుంచి మరో విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో 3,23,019మంది తల్లులు పథకం కోసం ఎదురుచూస్తున్నారు.

ఉచిత బస్సు.. తుస్సు..



మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని చంద్రబాబు ఎన్నికల ముందు చెప్పారు. ప్రకటనలే తప్ప ప్రయాణం లేదు. జిల్లాలో 10,95,130 మందికి ఎదురు చూపులే మిగిలాయి.

దీపం-2లో దగా..



సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. ఏడాది కాలంలో ఒకసారి మాత్రమే ఇచ్చారు. అది కూడా కొందరికే మాత్రమే. 7 లక్షలకు పైగా వినియోగదారులుండగా 4,40,000 మందికి మొదటి సిలిండర్‌కు పరిమితం చేశారు. వారిలో కూడా 5వేలకు పైగా వినియోగదారులకు నగదు జమ చేయలేదు.

50 ఏళ్లకు పింఛన్.. ఎగనామం..

50 ఏళ్లకే మహిళలకు పింఛన్ మంజూరు చేస్తామని చెప్పారు. గద్దెనెక్కాక హామీని విస్మరించారు. జిల్లాలో 3,07,537 మంది 50 ఏళ్ల పింఛన్‌కు అర్హులుగా ఉన్నారు.

విద్యార్థులకు ఫీజు కష్టాలు..

విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ చెల్లించలేదు. వసతి దీవెన, విద్యా దీవెన అందక జిల్లాలో45,657 మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేవలం ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.107కోట్ల వరకు ప్రభుత్వం బకాయి ఉంది.

ఇంటింటి సేవలు కట్..

విద్యుత్ ఛార్జీలు పెంచేశారు. ఆస్తి పన్ను పెంచేశారు. మరోవైపు కొత్తగా ఇళ్లు మంజూరు చేయలేదు. నిర్మాణంలో ఉన్న జగనన్న ఇళ్లకు బిల్లులు ఇవ్వడం లేదు. మరోవైపు ఇంటింటికీ అందాల్సిన వలంటీర్ల సేవలను నిలిపివేశారు. సచివాలయాలను నిర్వీర్యం చేసేశారు. తాజాగా ఇంటింటికీ అందించే రేషన్ సరుకులు నిలిపివేశారు.

ఏడాదిలో 22 హత్యలు..

కూటమి అధికారంలోకి వచ్చాక ఏడాది కాలంలో జిల్లాలో 22హత్యలు జరిగాయి. అందులో రెండు రాజకీయ ప్రేరేపిత హత్యలున్నాయి. దాడులు, అత్యాచారాల సంగతి చెప్పక్కర్లేదు. మరోవైపు గంజాయి వినియోగం విచ్చలవిడిగా పెరిగింది. పొన్నాడ, భగీరథపురం, ముద్దాడ, కొంగరాం గ్రామ సర్పంచ్‌లు నేరుగా వచ్చి ఎస్పీకి ఫిర్యాదు చేశారంటే పరిస్థితి ఎంత భయంకరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.



నేతల జేబుల్లోకి ఇసుక సొమ్ము..

ఉచిత ఇసుక ఇస్తామని చెప్పి ర్యాంపుల వద్ద నిలబడి డబ్బులు వసూలు చేస్తున్నారు. అనుమతుల్లేకుండా ర్యాంపులు నిర్వహించి, అడ్డగోలుగా దోచుకుంటున్నారు. అక్రమ తవ్వకాలు ఒక ఎత్తు అయితే.. ఆ అక్రమ ఇసుకను తరలించేందుకు నకిలీ బిల్లులు సృష్టించడం మరో ఎత్తు. తొగరాం పంచాయతీ దిబ్బలపేట, ముద్దాడ పేట, కాఖండ్యాం, నారాయణపురం, పురుషోత్తపురం, చినంకలాం, నిమ్మ తొర్లాడ, దూసి, తోటాడ, అక్కివరం, బెలమం, లొద్దలపేట, కొత్తవలస, సింగూరు, నైరా, అంబళ్లవలస, భైరి, కరజాడ, బూరవల్లి, కళ్లేపల్లి, కిల్లిపాలెం, పొన్నాం, బట్టేరు, గార, మడపాం, పర్లాం, రామకృష్ణాపురం, శ్రీముఖలింగం, దొంపాక, లుకలాం, బుజ్జిపేట, చెవ్వాకులపేట, గోపాలపెంట, ఉర్లాం, బిర్లంగి, బొడ్డవడ, ఈదుపురం, కేసుపురం, కొలిగాం, ఇచ్ఛాపురం టౌన్ పరిధిలో బాహుదా నది కొత్త, పాత బ్రిడ్జిల దగ్గర, పాతపట్నం నియోజకవర్గంలోని ఆకులతంపర, పాత పానుటూరు, హిరమండలం మండలంలోని పలు గ్రామాల్లో ఇసుక దందా సాగిస్తున్నారు.



గ్రానైట్, గ్రావెల్, మట్టి దోపిడీ..

టెక్కలి, పాతపట్నం, ఆమదాలవలస నియోజకవర్గాల్లో గ్రానైట్ దోచేస్తుండగా, మిగతా నియోజకవర్గాలన్నింటిలోనూ గ్రావెల్, మట్టి దోపిడీ చేస్తున్నారు. వనరుల దోపిడీలో పచ్చనేతలు పోటీ పడుతున్నారు.

రోడ్ల ముసుగులో అవినీతి..

అటు మరమ్మతుల రోడ్లు, ఇటు ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపొనెంట్ కింద చేపట్టిన రోడ్లు తెలుగు తమ్ముళ్లకు కాసులు కురిపించాయి. దాదాపు రూ.185కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఉపాధి రోడ్లలో భారీగా అక్రమాలు జరిగాయి. బాగున్న రోడ్లపై కొన్ని చోట్ల రోడ్లు వేయగా, మరికొన్నిచోట్ల నాసిరకం రోడ్లు వేసి నిధులు స్వాహా చేశారు. ఇంకొన్నిచోట్ల ఏకంగా నాయకుల పొలాలు,ఫాంహౌస్‌లు, కొబ్బరితోటలు, రియల్ ఎస్టేట్ వెంచర్ల రోడ్లు వేసుకుని లబ్ధిపొందారు. ఇదే విధంగా మరమ్మతుల కింద రూ.31కోట్ల రోడ్ల నిధులను సైతం కొల్లగొట్టారు.



బలగ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో నిలిచిన నాడు-నేడు పనులు

ఏ బడికి పోవాలమ్మా?

- ప్రభుత్వ పాఠశాలను 9 రకాల స్కూళ్లగా విభజించిన కూటమి ప్రభుత్వం
- ఎక్కడికి వెళ్లాలో తెలియని సందిగ్ధంలో విద్యార్థులు
- మరో వైపు బదిలీల ప్రక్రియలో నిమగ్నమైన ఉపాధ్యాయులు
- పూర్తియిలో చేరని పాఠ్యపుస్తకాలు, యూనిఫాం
- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

శ్రీకాకుళం న్యూకాలనీ : బడిగంటకు వేళయ్యింది. అనేక సమస్యలు, సవాళ్లు, సందేహాలు, ఒడిదొడుకుల నడుమ జిల్లాలో గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. కూటమి ప్రభుత్వం పాఠశాలలను 9 రకాల స్కూళ్లగా విభజించడంతో ఇప్పుడు ఏ బడికి తమ పిల్లలను పంపించాలో తెలియక విద్యార్థుల తల్లిదండ్రులు అయోమయం చెందుతున్నారు. మరోవైపు ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, శిక్షణా తరగతల్లో ఉపాధ్యాయులు బిజీబిజీగా ఉన్నారు. ఇంకోవైపు పలు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఇష్టారాజ్యంగా ఫీజులు, పుస్తకాల దోపిడీ కొనసాగుతున్నా పాలకులు స్పందించడం లేదు. మరోవైపు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది తల్లికి వందనం పథకం గాలికి ఎగిరిపోయింది. రెండో విద్యాసంవత్సరంలో కూడా తల్లికి వందనం పథకం అమలుపై పూర్తిస్థాయి స్పష్టత రాలేదు. జిల్లాలో 1,62,554 మంది విద్యార్థులు చదువుతున్నారు. 400 ప్రైవేటు పాఠశాలల్లో 95 వేల మంది వరకు చదువులు కొనసాగిస్తున్నారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

స్టూడెంట్ కిట్‌లేవి ?

గత ప్రభుత్వంలో విద్యాకానుక పేరిట పాఠశాలలు పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు అందజేసేలా నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పకడ్బందీగా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తి భిన్నంగా తయారైంది. ఇప్పటికీ అనేక తరగతులకు పాఠ్యపుస్తకాలు రాలేదు. యూనిఫాం, బ్యాగులు, బూట్లు, సాక్సులు ఇంకా రావాల్సి ఉంది. దీంతో తొలిరోజు విద్యార్థి మిత్ర కిట్లను ఎలా పంపిణీ చేయాలో తెలియక హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు.

వారికి గత యూనిఫామేనంట..

గత ప్రభుత్వంలో వినియోగించిన యూనిఫాం ఎక్కడా కనిపించకూడదని వీల్లేదని అధికారులకు హుకుం జారీ చేసిన ప్రభుత్వం.. హైస్కూల్ ప్లస్, ఏపీ మోడల్ స్కూళ్లు, కేజీబీవీల్లో చదువుతున్న ఇంటర్ విద్యార్థులకు మాత్రం యూనిఫాం సంగతి తేల్చలేదు. దీంతో వారంతా పాత యూనిఫాంనే ధరించనున్నారు.

ఇదీ పరిస్థితి..	
జిల్లాలో ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు	2955
శాటిలైట్ స్కూళ్లు	17
ఫౌండేషనల్ స్కూళ్లు	248
బేసిక్ ప్రైమరీ స్కూళ్లు	1682
మోడల్ ప్రైమరీ స్కూళ్లు	385
అప్పర్ ప్రైమరీ స్కూళ్లు	198
హైస్కూళ్లు	295
హైస్కూల్ జీపీఎస్	89
హైస్కూల్+ఎంపీఎస్	41





ఎచ్చెర్ల మండలం కొయ్యాం జెడ్పీహెచ్ స్కూల్‌లో ఓ భవనంలో ఫ్లోరింగ్ దుస్థితి

నాడు-నేడు పనులకు మోక్షం లభించేనా..?

గత ప్రభుత్వం సర్కారీ బడులకు కొత్తశోభ తీసుకొచ్చింది. వేలాది కోట్లను వెచ్చించి ప్రభుత్వ బడులు, కాలేజీలు, హాస్టళ్లను సుందరంగా తీర్చిదిద్దడంతోపాటు అదనపు భవనాలు, కొత్త తరగతి గదుల నిర్మాణం మొదలుకుని అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించింది. మొదటి విడతగా రూ.286 కోట్ల నిధులతో 1247 స్కూళ్లను సుందరంగా తీర్చిదిద్దారు. రెండో ఫేజ్‌లో 1096 విద్యాసంస్థలను తీర్చిదిద్దాలని తలచి రూ.427 కోట్లు మేర కేటాయించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో 962 విద్యాసంస్థల్లో వివిధ దశల్లో పనులు నిలిచిపోయాయి.

సన్నబియ్యం బువ్వ అందేనా?

ఎండీఎం పథకాన్ని డొక్కా సీతమ్మగా మధ్యాహ్న భోజనం పథకంగా పేరు మార్చుతూ సన్నబియ్యంతో ఆహారం అందిస్తామని కూటమి ప్రభుత్వం పేర్కొంది. గత విద్యాసంవత్సరం నాసిరకమైన భోజనాలు పెట్టడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. కొత్త విద్యా సంవత్సరంలో సన్నబియ్యంతో భోజనాలు పెడతారో లేదోనన్న మీమాంస నెలకొంది.

మార్గదర్శకాలు పాటించాలి..



ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం గురువారం నుంచి బడులు తెరవాల్సి ఉంటుంది. శతశాతం మంది విద్యార్థులు హాజరయ్యేలా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలి. విద్యామిత్ర స్టూడెంట్ కిట్‌లో కొన్ని వస్తువులు పెండింగ్ ఉన్న మాట వాస్తవమే. ఉన్న వస్తువులతో స్టూడెంట్ కిట్లను అందజేస్తాం. తొలిరోజు నుంచే సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం అందజేస్తాం.

– డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, డీఈఓ, శ్రీకాకుళం

పండ్ల తోటల పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర వర్గాల చిన్న, సన్నకారు రైతులు (ఐదు ఎకరాలలోపు భూమి కలిగిన వారు) పండ్ల తోటల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ డీపీసీ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరం కోసం ప్రభుత్వం చేపట్టిన వర్షాధారిత పండ్లతోటల పెంపకం పథకం కింద జిల్లాలో 22 రకాల మొక్కలను ఉచితంగా అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకం కింద మామిడి, జీడి, నిమ్మ, జామ, సపోటా, కొబ్బరి, జామున్, చింత, సీతాఫలం, దానిమ్మ, అత్తి, బేరు, బటర్ ఫ్రూట్, జాక్ ఫ్రూట్, డ్రాగన్ ఫ్రూట్, మునగ, స్వీట్ ఆరెంజ్, ఆయిల్ పామ్, కోకో, పూల తోటలుగా రోస్, జాస్మిన్ వంటి పంటలకు నిర్వహణ ఖర్చులు పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని వివరించారు. జాబ్ కార్డు కలిగిన అర్హులైన రైతులు సంబంధిత మండల కార్యాలయాల్లోని ఎంపీడీఓ, ఏపీఓలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు ఆర్టీసీ బస్‌పాసులు

శ్రీకాకుళం అర్బన్: నూతన విద్యాసంవత్సరంలో ఆర్టీసీ ఇచ్చే రాయితీ పాసులు, ఫ్రీ పాస్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బస్‌పాసుల కోసం పాత వెబ్‌సైట్‌ను నవీకరిస్తున్నందున ఈ నెల 12, 13వ తేదీలలో పాసుల జారీ కుదరదని పేర్కొన్నారు. 14వ తేదీ నుంచి యథావిధిగా బస్ పాసుల జారీ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. స్టడీ సర్టిఫికెట్, బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు ద్వారా ఆన్‌లైన్‌లో apsrtcpass.in లో వివరాలు నమోదు చేసుకుని, పలాస, టెక్కలి, శ్రీకాకుళం బస్ స్టేషన్లలోని బస్‌పాస్ కౌంటర్ వద్ద పాసులు పొందవచ్చని సూచించారు.

విందు భోజనం..



పాత శ్రీకాకుళంలో సిరిమానోత్సవం సందర్భంగా బుధవారం జరిగిన విందు భోజనాలకు జనం పోటెత్తారు. జిల్లా పరిషత్ కూడలి నుంచి కలెక్టర్ ఆఫీస్, బాదుర్లపేట, కొత్తపేట, కునుకుపేట వరకు ఉన్న సుమారు మూడు వేల కుటుంబాల వద్దకు బంధువులు భారీగా తరలి వచ్చారు. దీంతో రహదారి కిక్కిరిసిపోయింది. – శ్రీకాకుళం కల్చరల్

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న ట్రాక్టర్లు

జలుమూరు: కొమనాపల్లి వద్ద వంశధార నది నుంచి అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న ఎనిమిది ట్రాక్టర్లను పట్టుకుని రూ.24 వేలు అపరాధ రుసుం వసూలు చేశామని తహసీల్దార్ జెన్ని రామారావు బుధవారం తెలిపారు. ఇప్పటికే పలుమార్లు దండోరాలు, హెచ్చరికలు చేసినా నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేస్తుండటంతో దాడులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఒక్కో ట్రాక్టర్‌కు మూడు వేలు చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనమే లక్ష్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తామని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం సరఫరా అవుతున్న సాధారణ బియ్యం స్థానంలో త్వరగా ఉడికే, నాణ్యమైన సన్న బియ్యాన్ని అందించేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. గురువారం నుంచే సన్న బియ్యం పంపిణీ ప్రారంభమవుతుందని తెలిపారు. మొత్తం 2,599 పాఠశాలలు, 153 హాస్టళ్లకు కలిపి 655 టన్నుల సన్న బియ్యం ఇప్పటికే సరఫరా పూర్తయ్యిందన్నారు. బియ్యం సరఫరాలో పారదర్శకత కోసం 'ట్రేసబిలిటీ' విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజాదరణ ఓర్వలేకే కవ్వింపు చర్యలు



సింగుపురం మోహన్‌రావు

టెక్కలి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లభిస్తున్న ప్రజాదరణ చూసి తట్టుకోలేక కూటమి నాయకులు కుట్రలు పన్నుతున్నారని, ఇందులో భాగంగానే పొదిలిలో కవ్వింపు చర్యలుగా రాళ్లతో దాడులు చేశారని న్యాయవాది, వైఎస్సార్‌సీపీ నాయకుడు సింగుపురం మోహన్‌రావు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పొగాకు రైతుల సమస్యలు తెలుసుకునేందుకు వెళ్లిన మాజీ ముఖ్యమంత్రిపై ఇలా దాడులు చేయడం సబబు కాదన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో పూర్తిగా వైఫల్యం చెందిందని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసి తప్పు చేశామనే భావన ప్రజల్లో ఏర్పడిందని, అందుకే మరలా జగన్ పాలన కోరుకుంటున్నారని పేర్కొన్నారు. జగన్ కాన్వాయ్‌పై దాడికి పాల్పడి కూటమి నాయకులు కుట్ర బుద్ధి చూపించారని, ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు.

కేంద్ర గ్రంథాలయాన్ని పరిరక్షించాలి



మాట్లాడుతున్న కమిటీ ప్రధాన కార్యదర్శి వైకుంఠరావు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని రక్షించాలని పలువురు ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శ్రీకాకుళంలోని యూటీఎఫ్ భవన్‌లో బుధవారం కేంద్ర గ్రంథాలయ పరిరక్షణ కమిటీ సమావేశం అధ్యక్షుడు కరణం బుచ్చి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గ్రంథాలయ పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి తమరి వైకుంఠరావు మాట్లాడుతూ కేంద్ర గ్రంథాలయం భవన సముదాయాన్ని అన్యాక్రాంతం చేసే ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్ష కార్యదర్శులు ఎం.ప్రభాకర్, పి.సుధాకర్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పేకల తేజేశ్వరరావు, జనవిజ్ఞాన వేదిక ఎడ్యుకేషన్ సబ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ గొంటి గిరిధర్, జె.వి.వి.సమత, కో-కన్వీనర్ తంగి ఎర్రమ్మ, గ్రంథాలయ ఉద్యోగ సంఘ నాయకులు ఉగ్రేసేన, చిరంజీవి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాతపట్నం: కాగువాడ గ్రామానికి చెందిన అగూరి కేశవరావు(41) శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్‌ఐ టి.శ్రీనివాసరావు తెలిపారు. కేశవరావు ఈ నెల 9వ తేదీ రాత్రి గ్రామ పరిధిలోని రహదారిపై నడిచి వెళుతుండగా.. సీది నుంచి బూరగాం వైపు వస్తున్న ద్విచక్ర వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే బాధితుడిని పాతపట్నం సీహెచ్‌సీ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కేశవరావు భార్య ఉషాకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ తెలిపారు.

ఆర్టీసీలో బదిలీలు

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలోని నాలుగు డిపోల పరిధిలో పలువురు ఆర్టీసీ అధికారులకు బదిలీలు జరిగాయి. శ్రీకాకుళం ఒకటో డిపో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న వి.రమేష్‌కు పాలకొండ డిపో అసిస్టెంట్ మేనేజర్‌గా, పలాస డిపోలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న పిసకాన సంతోష్‌కు శ్రీకాకుళం ఒకటో డిపో అసిస్టెంట్ మేనేజర్‌గా బదిలీ జరిగింది. వీరు త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు. సాలూరు డిపో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న కరుణశ్రీ పలాస డిపో అసిస్టెంట్ మేనేజర్‌గా బదిలీ అయ్యారు.

పక్షవాత బాధిత ఉద్యోగులపై..

కక్ష ఎందుకో?



జిల్లా పరిషత్ కార్యాలయం

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కూటమి పాలకులు
- గోడు వినకుండా దూరప్రాంతాలకు బదిలీలు
- ఆవేదన చెందుతున్న బాధితులు

అరసవల్లి:

వారంతా ఒకప్పుడు ఎంతో హుషారుగా పంచాయతీరాజ్ శాఖలో విధులు నిర్వర్తించినవారే.. కానీ దురదృష్టవశాత్తు పక్షవాతానికి గురయ్యారు.నలుగురు తోడులేకపోతే...ఇంటి నుంచి కార్యాలయానికి రాలేని దుస్థితి. అయినా విధుల విషయంలో ఎక్కడా తగ్గకుండా తమవంతు పనులు పూర్తి చేస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక వీరిని సుదూర ప్రాంతాలకు బదిలీ చేసేశారు. కనీసం కనికరం లేకుండా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జెడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా బదిలీ ఉత్తర్వులు ఇవ్వడంతో బాధితులంతా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు మొరపెట్టుకున్నా ఏమాత్రం పట్టించుకోలేదని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న ఉద్యోగులను బదిలీల అంశంలో గత ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా వారికి సమీప స్థానాలను కేటాయించిన సంగతి విదితమే.

బదిలీలతో అవస్థలు..!

పంచాయతీరాజ్ వ్యవస్థలో జిల్లా పరిషత్ యాజమాన్యానికి జెడ్పీ ఛైర్‌పర్సన్‌దే రాజముద్ర. అలాంటింది.. కూటమి ప్రభుత్వంలో తమ పార్టీకి చెందని వారు ఛైర్మన్లుగా ఉన్న క్రమంలో ఏమాత్రం ఆ స్థానానికి ప్రాధాన్యం ఇవ్వకుండా బదిలీల ప్రక్రియను చేపడుతున్నారు. జెడ్పీ యాజమాన్య ఉద్యోగులకు ఎనిమిది నెలల క్రితమేలో బదిలీలు జరిగాయి. అయితే కూటమి ప్రభుత్వం అనాలోచిత నిబంధనలతో మళ్లీ ఇదే శాఖలో బదిలీల కౌన్సెలింగ్ చేపట్టి ఉద్యోగులను తీవ్ర అవస్థలకు గురిచేసింది. వాస్తవానికి ఎనిమిది నెలల క్రితం పలు ప్రాంతాలకు బదిలీ అయిన ఉద్యోగుల పాత స్థానాల నుంచి ఎస్‌ఆర్‌లు కొత్త ప్రదేశాలకు చేరలేదు. అయినప్పటికీ ఐదేళ్ల నిబంధనలంటూ లాస్ట్ గ్రేడ్ ఉద్యోగులను సైతం వదలకుండా బదిలీలు చేపట్టింది. దీంతో యంత్రాంగం కూడా తీవ్ర ప్రయాసలకు లోనై.. మరోవైపు కూటమి నేతల సిఫారసు లేఖల ఒత్తిళ్లతో నలిగిపోయారు. అయినప్పటికీ ఏదోలా బదిలీల ప్రక్రియను ముగించారు. బదిలీ జరిగిన ఉద్యోగులు వెంటనే కొత్త స్థానాల్లో చేరాలంటూ ఉత్తర్వులు జారీ చేశారు.

మినహాయించాల్సింది..



అనారోగ్య పరిస్థితుల్లో ఉన్న ఉద్యోగులకు, దివ్యాంగులకు బదిలీ మినహాయింపు ఇవ్వాల్సింది. వారు దూరప్రాంతాలకు వెళ్లి ఉద్యోగాలు చేయడం ఇబ్బందిగా ఉంటుంది. మానవతా దృక్పథంతో మినహాయింపు ఇస్తే మంచిదని మా అభిప్రాయం.

– కె.నారాయణరావు, పి.ఆర్.మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు

బాధితుల్లో కొందరు..



బోనెల గాయత్రి: ఈమె అమలపాడు (టెక్కలి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. పక్షవాతం సోకి చెయ్యి, కాళ్లు పడిపోయాయి. గత ప్రభుత్వం వెసలుబాటు ఇచ్చినా ఈసారి మాత్రం ఏకంగా 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న తలవరం (నౌపడ) జెడ్పీ హైస్కూల్‌కు బదిలీ చేశారు.



ఎస్.రామప్పుడు: ఈయన మండాకురిటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్. పదేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నారు. గత ప్రభుత్వం మానవతా దృక్పథంతో బదిలీ చేయకపోగా..ఈసారి మాత్రం కూటమి సర్కారు ఏకంగా 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న సంతకవిటి జెడ్పీ హైస్కూల్‌కు బదిలీ చేసేసింది. నలుగురి తోడుతోనే బదిలీ కౌన్సెలింగ్‌కు హాజరైనా అధికారులు ఏమాత్రం కనికరం చూపలేదు.



డి.గణేశ్వరరావు: ఈయన కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్. దివ్యాంగుడైన ఈయనకు రెండు కిడ్నీలు పాడైపోయాయి. మూర్ఛ రోగం.. పక్షవాతం కూడా. ఈయన పరిస్థితి చూసి తోటి ఉద్యోగులు విధుల విషయంలో చాలా సహకరిస్తారు. అయినా కూటమి ప్రభుత్వం జాలి చూపించకుండా ఏకంగా 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుడారి రాజపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు బదిలీ చేశారు.

ఇంటర్ విద్యలో బది'లీలలు'



ఇంటర్మీడియెట్ విద్య డీవీఈఓ కార్యాలయం

- ప్రిన్సిపాళ్లు, లెక్చరర్ల ఆప్షన్స్‌ను పరిగణనలోకి తీసుకోని ప్రభుత్వం
- రాజకీయ సిఫారసులు, పైరవీలతో ఇష్టారాజ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ విద్యనందిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉద్యోగుల బదిలీలు విమర్శలకు తావిస్తోంది. ప్రిన్సిపాళ్లు, జూనియర్ లెక్చరర్లు, సిబ్బంది బదిలీల పర్వంలో చోటుచేసుకున్న ఉదంతాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. కూటమి ప్రభుత్వంలో పలువురి నేతలను ప్రసన్నం చేసుకోవడం ద్వారా అనేకమంది తమకు నచ్చిన స్థానాలను ఎగరేసుకుపోగా.. ఇంకొంతమంది తీవ్ర అన్యాయానికి గురై నష్టపోయారు. సీనియారిటీ ఉన్నప్పటికీ గత్యంతరంలేక సుదూర ప్రాంతాలకు వెళ్లిపోవావాల్సి వచ్చిందని ఆవేదన చెందుతున్నారు.

నో ఆప్షన్..

జిల్లాలో 38 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో రెగ్యులర్ ప్రిన్సిపాళ్లు 29, జేఎల్స్ 85 మంది వరకు ఉన్నారు. వీరితోపాటు ఆఫీస్ సబార్డినేట్, జూనియర్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్ తదితర నాన్ టీచింగ్ సిబ్బంది మరో 89 మంది వరకు పనిచేస్తున్నారు. వీరందరిలో సుమారు 75 మంది వరకు బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా పనితీరు ఆధారంగా ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లకు పాయింట్లను నిర్ణయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సీనియారిటీతోపాటు విద్యార్థుల సంఖ్య, వారి ఫలితాలకు కూడా ప్రత్యేక పాయింట్లను కేటాయించారు. ఈ మార్గదర్శకాల ప్రకారం ఆప్షన్లుగా ఇచ్చుకున్నారు. అయితే వారు ఎంపికచేసిన మొదటి ప్రయారిటీ ఆప్షన్లను కాదని వేరేచోట్ల నియామకం చేస్తు ఉత్తర్వులు జారీ చేశారు. రేషనైలేజేషన్ చర్యలు వల్ల షిఫ్టింగ్ పోస్టుల్లో చేరేందుకు లెక్చరర్లు ఆసక్తి చూపలేదు. మొత్తమ్మీద జిల్లాలో ఇప్పటి వరకు 58 మంది వరకు బదిలీలు జరిగినట్టు గణాంకాలు చెబుతున్నాయి.

పైరవీలకే పెద్దపీట..

తమకు కావాల్సిన స్థానం కోసం కూటమి ప్రభుత్వంలోని పెద్దలు, మంత్రులు, అధికార పార్టీ నాయకుల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సిఫారసులు, పైరవీలు పెద్ద ఎత్తున పనిచేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులను ప్రసన్నం చేసుకుని అనేక మంది లెక్చరర్లు/ కాంట్రాక్ట్ లెక్చరర్లు వారు పనిచేస్తున్న స్థానాలను కాపాడుకోవడం కోసం ఆర్జేడీ కార్యాలయంలో పైరవీలు చేసుకుని బ్లాక్ చేసుకున్నారని ప్రచారం సాగుతోంది. పోస్టులను బ్లాక్ చేస్తున్నారన్న విషయం ఏకంగా ఇంటర్మీడియెట్ విద్య డైరెక్టర్‌కు చేరినా.. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయిందని తెలుస్తోంది.

పారదర్శకమే..



ఇంటర్మీడియెట్ విద్యలో బదిలీల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగాయి. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు జరిగాయి కాబట్టి ఆరోపణలకు ఆస్కారంలేదు. ప్రభుత్వ మార్గదర్శకాలు, సీనియారిటీ ప్రకారమే ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు, సిబ్బంది బదిలీలను పకడ్బందీగా చేపట్టడం జరిగింది. మరికొంతమంది బదిలీలు ఇంకా మిగిలి ఉన్నాయి.

– ఆర్.సురేష్‌కుమార్, ఇంటర్మీడియెట్ విద్య డీవీఈఓ, శ్రీకాకుళం

ఇంటింటికీ రేషన్ కొనసాగించాలి



పాతపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

పాతపట్నం: రేషన్ బియ్యం, సరుకులను ఇంటింటికి అందజేసే ఎండీయూ వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయడం దురదృష్టకరమని, దీని వల్ల రేషన్ డీలర్లు సరుకులను నల్ల బజారులో అమ్ముకుంటారని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. పాతపట్నంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద పార్టీ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ ఆధ్వర్యంలో సీపీఐ జిల్లా 25వ మహాసభలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ఎండీఎం వ్యవస్థపై ప్రభుత్వం నిర్ణయం మార్చుకోకపోతే శ్రీకాకుళం జిల్లా నుంచే ఉద్యమం ప్రారంభిస్తామన్నారు. మావోయిస్టులను అంతం చేస్తామని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తుందని, అది నిజమైన పాలన కాదన్నారు. మావోయిస్టులను చంపితే దేశం అభివృద్ధి చెందదని, నిరుద్యోగ సమస్య పరిష్కరించి పేదరిక నిర్మూలన చేయాలన్నారు. దోపిడీ వ్యవస్థను కొనసాగించకుండా చూడాలని, గిరిజనులను కాపాడాలని కోరారు. లేదంటే ఎర్రజెండాలు అంతా ఒకటవుతాయన్నారు. ఇటీవల పాకిస్తాన్‌తో యుద్ధ జరిగితే కేంద్ర ప్రభుత్వం చర్చలు జరిపిందని, కానీ దేశంలో ఉన్న మావోయిస్టులతో మాత్రం చర్చలు జరపకుండా కాల్పులు జరపడం తగదన్నారు. వంశధార రిజర్వాయర్ పనులు వేగవంతం చేయాలని, నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. అంతకుముందు పాతపట్నం సెంటిస్స్ పాఠశాల నుంచి సబ్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్.కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు చాపర సుందర్‌లాల్, జిల్లా అదనపు కార్యదర్శి లండ వెంకటరావు, ఎస్.నర్సింహులు, జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాస్, మండల కార్యదర్శి దూసి శారద, దూసి భాస్కరరావు, డీహెచ్‌పీఎస్ ప్రధాన కార్యదర్శి గోపి, నాయకులు ఆదినారాయణ ఆచారి, మోహన్‌రావు, సింహాచలం, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బ్యాగ్ అప్పగింత



లక్ష్మీనారాయణకు బ్యాగును అప్పగిస్తున్న పోలీసులు

పాతపట్నం: ఆటోలో పోగొట్టుకున్న బ్యాగ్‌ను పాతపట్నం పోలీసులు తిరిగి ప్రయాణికుడికి అప్పగించారు. పాతపట్నం మండలం సింగుపురం గ్రామానికి చెందిన ముధ్వల లక్ష్మీనారాయణకుటుంబ సభ్యులతో కలిసి పాతపట్నంలోని ఆల్‌ఆంధ్ర రోడ్డు కూడలి నుంచి బుధవారం ఆటోలో సింగుపురం వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో సింగుపురంలో దిగిపోయాడు. ఆ సమయంలో బ్యాగు మరిచిపోయాడు. అనంతరం విషయం గుర్తించి పాతపట్నం పోలీసులకు తెలియజేశాడు. వెంటనే పోలీసులు సీసీ ఫుటేజీను పరిశీలించి.. ఆటో పర్లాకిమిడి(ఒడిశా)కి చెందిన నాగులపు సింహాద్రిగా గుర్తించి రప్పించారు. ఆటోడ్రైవర్ బ్యాగును తీసుకురాగా.. అందులో రూ.20 వేలు నగదు, బంగారం చెవిదిద్దులు గుర్తించి వాటిని లక్ష్మీనారాయణకు అప్పగించారు. కార్యక్రమంలో రైటర్ శంకర్, కానిస్టేబుల్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరిట మోసం!

- లింగంనాయుడుపేట కేంద్రంగా దందా
- భారీగా వసూళ్లకు పాల్పడిన హెడ్ కానిస్టేబుల్
- ఉద్యోగాలు రాక లబోదిబోమంటున్న బాధితులు

జలుమూరు: ఉద్యోగాల పేరిట ఓ హెడ్ కానిస్టేబుల్ భారీగా వసూళ్లకు పాల్పడినట్లు తెలిసింది. జలుమూరు మండలం సైరిగాం పంచాయతీ లింగంనాయుడుపేట కేంద్రంగా ఈ దందా జరిగినట్లు సమాచారం. లింగంనాయుడుపేటకు చెందిన ఓ హెడ్ కానిస్టేబుల్ విశాఖ ఏఆర్‌లో పనిచేస్తున్నాడు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో హోంగార్డ్ ఉద్యోగాలు ఇప్పిస్తానని స్థానిక నిరుద్యోగులను నమ్మబలికాడు. వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో సైతం సిబ్బంది నియామకాలు ఉన్నాయని మరికొంత మందికి ఆశచూపాడు. హోంగార్డ్ ఉద్యోగానికి రూ.ఆరు లక్షలు, కార్యాలయంలో ఉద్యోగాలకు రూ.నాలుగు లక్షలని నమ్మించాడు. ఒక్కో గ్రామంలో ఒక్కో వ్యక్తిని మధ్యవర్తిగా పెట్టుకొని డబ్బులు దండుకున్నాడు. తాను హోం మినిస్టర్ బంధువులు తనకు తెలుసని నమ్మబలికాడు. ఈ క్రమంలో తిమడాం గ్రామంలో కొంతమంది, లింగంనాయుడుపేటలో ఆరుగురు, కొమనాపల్లిలో మరికొంత మంది, పరిసర గ్రామాలకు చెందిన ఇంకొందరు నుంచి సుమారు రెండు కోట్ల రూపాయలు వరకూ వసూలు చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. డబ్బులు చెల్లించి ఏడాదవుతున్నా ఉద్యోగం రాకపోవడంతో బాధితులంతా ఇటీవల విశాఖ వెళ్లి హెడ్ కానిస్టేబుల్‌ను నిలదీశారు. తమ డబ్బులు తిరిగి చ్చేయాలని కోరగా.. తనకు పోలీస్ శాఖలో పెద్ద పరిచయాలు ఉన్నాయని, తనను ఎవరూ ఏం చేయలేరని దబాయించాడు. దీంతో రెండు రోజులు క్రితం తిమడాంకు చెందిన గ్రామపెద్దలతో కలిసి మరోసారి అడగ్గా.. తనకేం సంబంధం లేదని, డబ్బులు చెల్లించినట్లు ఆధారాలు లేవని ఎదురు తిరిగాడు. దీంతో చేసేదేమి లేక మధ్యవర్తులపై ఒత్తిడి తేవడంతో ఖాళీ చెక్కులు, ప్రామిసరీ నోట్‌లు రాయించుకున్నారు. మధ్యవర్తులు వారం రోజులు గడువు కోరినట్లు సమాచారం. అప్పటికీ డబ్బులు రానిపక్షంలో పోలీసులకు ఫిర్యాదు చేద్దామని బాధితులు నిర్ణయించుకున్నట్లు తెలిసింది.

డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్‌లో చోరీ

ఇంటి దొంగల పనే..

- రూ.2 కోట్ల విలువైన 450 గ్రాముల సెమాగ్లుటైడ్ చోరీ కేసు ఛేదన
- ఎనిమిది మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ మహేశ్వరరెడ్డి



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి, వెనుక నిందితులతో పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలోని పైడిభీమవరంలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్‌లో ఈ ఏడాది ఫిబ్రవరి 23న రూ.2 కోట్లు విలువైన 450 గ్రాముల సెమాగ్లుటైడ్ పౌడర్ అదృశ్యం కేసును పోలీసులు ఛేదించారు. కంపెనీ ఉద్యోగులే ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ఈ ఘటనలో ప్రమేయమున్న 8 మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 23న పైడిభీమవరం రెడ్డీస్ ల్యాబ్‌లో ఎఫ్‌జీ వేర్‌హౌస్‌లోని రెండు బ్యాచ్ ఫ్రీజర్ రూమ్‌లో 450 గ్రాముల సెమాగ్లుటైడ్ డ్రగ్ చోరీకి గురైందని యాజమాన్యం జె.ఆర్.పురం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. శ్రీకాకుళం డీఎస్పీ సిహెచ్ వివేకానంద పర్యవేక్షణలో మూడు బృందాలుగా విడిపోయిన జె.ఆర్.పురం సీఐ ఎం.అవతారం, ఎస్‌ఐ చిరంజీవి, లావేరు ఎస్‌ఐ జి.లక్ష్మణరావులు కేసును ఛేదించినట్లు తెలిపారు. విదేశాలకు ఉత్పత్తి చేయడానికి అనుమతి ఉన్న ఈ డ్రగ్‌ను భారత్‌లో అమ్మేందుకు అనుమతి లేకపోయినా బ్లాక్ మార్కెట్టులో రెట్టింపు విలువుండటంతో తక్కువ కాలంలోనే కోట్లు ఆర్జించొచ్చని దుండగులు ఈ పథకం పన్నినట్లు తెలిపారు.

కంపెనీ దొంగలే..

పైడిభీమవరం రెడ్డీస్ ల్యాబ్ ప్రొడక్షన్ యూనిట్‌లో ద్రోణాదుల సురేష్ , నరముల అప్పలనాయుడులు, వేర్‌హౌస్‌లో గాజుల వెంకటరాఘవేంద్ర పని చేస్తున్నారు. ముగ్గురికీ మద్యం అలవాటుంది. సురేష్‌కు దువ్వాడ రెడ్డీస్ ల్యాబ్‌లో పనిచేస్తున్న విజయనగరం జిల్లా డెంకాడ మండలం మొదలవలసకు చెందిన గొల్లపల్లి కాంతారావుతో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో కాంతారావు రెడ్డీస్ ల్యాబ్‌లో తయారవుతున్న సెమాగ్లుటైడ్ పౌడర్ తెస్తే వేరే వారికి అమ్మి డబ్బులు తెస్తానని సురేష్‌కు చెప్పడంతో సరేనన్నాడు. అది వేర్‌హౌస్‌లో విధులు నిర్వర్తిస్తున్న వెంకటరాఘవేంద్రతోనే సాధ్యమని తెలుసుకున్న సురేష్ అతనికి పని అప్పగించాడు.

పథకం ప్రకారం..

ఫిబ్రవరి 23న రాఘవేంద్ర డ్రగ్‌ను దొంగిలించి అప్పలనాయుడుకి ఇవ్వగా కంపెనీ ప్రహరీ నుంచి దూకి బయట ఓ చోట వుంచి.. డ్యూటీ దిగాక ఇంటికి తీసుకెళ్లి ఫ్రిజ్‌లో దాచాడు. మూడు రోజులయ్యాక సురేష్‌కు పైడిభీమవరంలో ఇవ్వగా విశాఖపట్నంలో ఉన్న కాంతారావుకు డ్రగ్‌ను చేర్చాడు. కాంతారావు కూల్ ప్యాక్‌చేసి డ్రగ్‌ను హైదరాబాద్ తీసుకెళ్లి అప్పటికే పరిచయమున్న తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా చినరావుపేట మండలం లింగాపురానికి చెందిన అజ్మీరా తిరుపతికి ఇచ్చాడు.

అమ్మకంలో జాప్యమై..

కొత్త ప్రాడెక్ట్(డ్రగ్) కావడంతో మార్కెట్లో అమ్మకం కాకపోవడంతో ఇంట్లోనే డీఫ్రిజ్‌లో తిరుపతి ఉంచేశాడు. తిరుపతి అమ్మేసివుంటాడని సురేష్ డబ్బులకోసం తరచూ ఫోన్ చేయడం.. ఎంతకీ ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో రాఘవేంద్ర, అప్పలనాయుడులను వెంటబెట్టుకుని హైదరాబాద్ వెళ్లి తిరుపతి వద్ద డ్రగ్‌ను తీసేసుకున్నాడు. దేశంలో వివిధ ఫార్మా కంపెనీలతో పరిచయాలున్న గుంటక సురేష్‌రెడ్డిని కలిసి డ్రగ్ అమ్మకానికి పెట్టమన్నాడు.

డూప్లికేట్ ప్రాడక్ట్ ఇచ్చి..

కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం తెల్లప్రోలు గ్రామానికి చెందిన గుంటక సురేష్ రెడ్డి హైదరాబాద్ బెర్మగూడ అమీన్‌పూర్‌లో ఉంటున్నాడు. ఈయన 2022లో పైడిభీమవరం అరబిందో ఫార్మా కంపెనీలో పనిచేసేటప్పుడు మహంతి మురళీధర్, పట్నాల మహష్, గూడ శివరామకృష్ణతో కలసి పెల్లాడియమ్ అనే ప్రాడక్ట్‌ను అమ్మివేసిన కేసులో నిందితుడు. అప్పట్లోనే అరబిందో కంపెనీ ఇతనికి ఉద్వాసన పలికింది. సురేష్‌రెడ్డి కూడా సరైన ధర రాకపోవడంతో డ్రగ్‌ను అమ్మలేకపోయాడు. గట్టిగా ప్రశ్నించినా సమాధానం లేకపోవడంతో డి.సురేష్.. జి.సురేష్‌రెడ్డి సొంత గ్రామానికి వెళ్లి ఒత్తిడి చేయడంతో హైదరాబాద్ వచ్చి డ్రగ్‌ను తీసుకుపోండని చెప్పాడు. దీంతో డి.సురేష్ విశాఖపట్నం పీఎంపాలెం, మధురవాడలకు చెందిన కల్లూరి బాలకృష్ణ, బగాతి నవీన్‌కుమార్‌లను వెంటబెట్టుకుని హైదరాబాద్ వెళ్లగా సురేష్ రెడ్డి డూప్లికేట్ డ్రగ్ ప్రాడెక్ట్‌ను ఇచ్చి ఏమార్చాడు. సురేష్ అదే డ్రగ్‌ను కాంతారావు సహాయంతో హైదరాబాద్‌లో ఉన్న తిరుపతికి ఇవ్వడం.. డూప్లికేట్ కావడంతో ఎవరూ కొనకపోవడంతో వారిలో గొడవలు మొదలయ్యాయి.

మరో కేసు వెలుగులోకి..

పై కేసు విచారణ జరుగుతున్న సమయంలోనే వీరు చేసే మరో నేరం బయటపడింది. ఎనిమిది నెలల క్రితం ఇదే రెడ్డీస్ ల్యాబ్‌లో రూ.60 లక్షల విలువైన 3.38 కిలోల పెల్లాడియం అసిటేట్‌ను ఈ ఉద్యోగులే చోరీ చేశారు. డి.సురేష్, రాఘవేంద్ర, అప్పలనాయుడులు కలసి జి.సురేష్‌రెడ్డికి డ్రగ్‌ను ఇవ్వగా అతను లల్లూయాదవ్ అనే వ్యక్తికి రూ. 25 లక్షలకు అమ్మడం.. అందులో రూ. 8 లక్షలు సురేష్‌రెడ్డి ఉంచేసుకుని మిగతా రూ.17 లక్షలు డి.సురేష్‌కి ఇవ్వడం.. డి.సురేష్ మిగతా ఇద్దరికి చెరో రూ.లక్ష చొప్పున ఇచ్చి రూ. 15 లక్షలు ఉంచేసి ఒకరికొకరు మోసం చేసుకుని చివరికి పోలీసుల విచారణలో నిజాలు చెప్పేశారు.

నిందితులకు రిమాండ్.

డ్రగ్ కేసులో డి.సురేష్, వెంకటరాఘవేంద్ర, అప్పలనాయుడు, కాంతారావు, సురేష్‌రెడ్డి, తిరుపతి, బాలకృష్ణ, నవీన్‌కుమార్‌లను అరెస్టు చేశారు. నిందితుల నుంచి సెమాగ్లుటైడ్ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. రూ. 60 లక్షల విలువైన పెల్లాడియంను రికవరీ చేయాల్సి ఉందని ఎస్పీ తెలిపారు.

ప్రతిభకు ప్రశంసలు..

కేసును చాకచక్యంగా ఛేదించిన డీఎస్పీ వివేకానంద పర్యవేక్షణలో మూడు బృందాలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. విలువైన ప్రాడక్టులు ఉండేచోట సీసీ కెమెరాలు లేకపోవడం విడ్డూరమని, మిగతా కంపెనీలు కచ్చితంగా సీసీ కెమెరాలు పెట్టుకోవాలని సూచించారు. కాగా, సెమాగ్లుటైడ్ డ్రగ్ టైప్-2 డయాబెటిస్ చికిత్స, దీర్ఘకాలిక ఊబకాయ నియంత్రణకు ఉపయోగించే పూర్తి పేటెంట్ ఉన్న ఔషధం. పెల్లాడియం అసిటేట్ అనేది రసాయన సమ్మేళనం.